క్లుప్తంగా

శాస్త్రోక్తంగా సుదర్శన యాగం



పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం సుదర్శన యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం కేసర్ల బాలాజీ స్వామి ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఇందుకూరుపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, అందుకు ప్రభుత్వం రుణ సహకారం అందిస్తోందని డీఆర్‌డీఏ ఏసీ(ఏరియా కోఆర్డినేటర్) శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఏపీఎం కార్యాలయంలో బ్యాంకర్లు, సీసీలు, వీఓఏలతో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్ర ద్వారా అర్హత కలిగిన వారికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పథకం(పీఎంఎఫ్‌ఎంఈ) యూనిట్లకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు 35 శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, కొత్తూరు, జగదేవిపేట, గంగపట్నం గ్రామాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని 16వ వార్డులో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. ఈ మేరకు 16వ వార్డులో విద్యుత్ మోటార్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ గత కొంత కాలంగా తాగునీటి సమస్య ఉందని, దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కౌన్సిలర్ ప్రమీలమ్మ తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీనిని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రమీలమ్మ, సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి కృపాకర్, స్థానికులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యతో ఎంతో ఉపయోగం

కొడవలూరు: విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో ప్రయోజనకరమని ఎంఈఓ జి.వసంత కుమారి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మకూరు, సంగం మండలాల్లోని 160 మంది ఉపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డు(ఐఎఫ్‌పీబీ)లు రానున్నాయన్నారు. వీటి ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. వీటిపై జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఈనెల 15వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో బ్యాచ్‌కు రెండ్రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో రెండు వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ విభాగాధిపతులు ప్రవీణ్‌కుమార్, కేవీ నాగేంద్ర, ప్రఫుల్‌కుమార్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓ జి.సుధీర్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్‌ఎం డి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ - కేవైసీ చేయించుకోవాలి

ముత్తుకూరు : రైతులు విధిగా పీఎం కిసాన్–ఈకేవైసీ చేయించుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. ముత్తుకూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను విధిగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ



అద్దాల మందిరంలో విశేషాలంకారంలో సాయినాథుడు



కృష్ణ మందిరంలో..



దర్శించుకుంటున్న భక్తులు



చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని సాయిబాబా మందిరంలో..

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను నగరంలో భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకొన్నారు. విశేష పూజా కార్యక్రమాలతో సాయినాథుడి మందిరాలు శోభిల్లాయి. విశేషంగా తరలివచ్చిన భక్తులు సాయినాథుడ్ని దర్శించుకొని తన్మయత్వం చెందారు.

➡ బాలాజీనగర్‌లోని పద్మావతినగర్‌లో గల సాయిదర్బార్ అద్దాల మందిరంలో షిర్డీ సంప్రదాయరీతిలో సాయినాథుడికి కాకడ, మధ్యాహ్న, సాయంసంధ్య, శేజ్ హారతులిచ్చారు. ప్రత్యేకాభిషేకాలు చేశారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు ఓం సాయి శ్రీసాయి జయ జయసాయి అఖండ సాయినామ సంకీర్తనను జరిపారు. విష్ణుసహస్రనామ పారాయణాన్ని సామూహికంగా నిర్వహించారు. పల్లకి ఉత్సవం, ఊంజల్‌సేవ, పవళింపుసేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మందికిపైగా పండరిభజన గురువులు, 200 మందికిపైగా కళాకారులతో లక్ష్మీసాయి ఆధ్వర్యంలో పండరి భజనలు, కోలాట ప్రదర్శనను నిర్వహించారు. దాదాపు ఆరు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఉభయకర్తలుగా హరికిరణ్‌రెడ్డి, నిత్యరాజ్యలక్ష్మి దంపతులు, కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్, దేవకిదేవి దంపతులు, యోగ్య సాహితి వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, మందిర గౌరవ సలహాదారు పాటోలు రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

➡ భక్తవత్సలనగర్‌లోని సాయిబాబా మందిరంలో నగర సంకీర్తన, సాయినాథుడికి క్షీరాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర పూజలను నిర్వహించారు. హారతి, బాబా నగరోత్సవాన్ని రాత్రి జరిపారు. మందిర కమిటీ చైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు పర్యవేక్షించారు.

➡ వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతం, వ్యాస మహర్షికి పూజలు చేశారు. ఉభయకర్తగా బిజ్జం విజయ్‌కుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు కమిటీ ఉపాధ్యక్షుడు వేణుబాబు, కార్యనిర్వాహకుడు మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, తదితరులు పర్యవేక్షించారు.

➡ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్వాములు, గురువులను నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో వీహెచ్‌పీ, రాజరాజేశ్వరి భక్తమండలి ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు రఘుస్వామి, నేతలు మెంటా రామ్మోహన్‌రావు, మోహన్‌రావు, రాజేంద్రప్రసాద్, నాగయ్య, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

➡ పరమేశ్వరినగర్ సాయికృష్ణ లేఅవుట్లోని ఆంజనేయస్వామి మందిరంలో పూజలు, సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. అర్చకుడు రాఘవేంద్రగోపీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా శ్రీనివాసకుమార్, కుమార్‌సింగ్, పవన్‌కుమార్, వంశీకృష్ణ దంపతులు వ్యవహరించారు.

నెల్లూరు(బారకాసు): వెంగళరావునగర్‌లోని ఎన్బీటీ కాలనీలో గల సాయిబాబా మందిరంలో అన్నదానం చేశారు. తొలుత సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, తదితరులు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ సమీపంలో..



కృష్ణ యోగ మందిరంలో..



వెంగళరావునగర్‌లో అన్నప్రసాద వితరణ



భక్తవత్సలనగర్‌లో..

‘జగనన్న సురక్ష’ పక్కాగా జరగాలి



పొదలకూరు : మండల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీఓ టి.నగేష్‌కుమారితో కలిసి సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అపరేటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన బిరదవోలు, డేగపూడి సచివాలయాల్లో సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి 11 రకాల సర్టిఫికెట్లను మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా అందించినట్లు తెలిపారు. మిగిలిన సచివాలయాల్లో గందరగోళ పరిస్థితి నెలకొనకుండా బిరదవోలులో సర్టిఫికెట్లను అందజేసిన డీఏలు వారి అనుభవాన్ని మిగిలిన డీఏలకు వివరించాల్సిందిగా సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ముందుగా వెరిఫికేషన్ పూర్తి చేసి తర్వాత క్యాంపు ద్వారా సర్టిఫికెట్లు అందజేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శివమోహన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

ఇందుకూరుపేట : గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్‌ఈఈ బాలసుబ్బారావు సూచించారు. మండలంలోని కొత్తూరులో నిర్మిస్తున్న భవనాలను అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా వీటిని నూరు శాతం పూర్తి చేయాలని కోరారు. అయన వెంట డీఈ గౌతమ్, ఏఈ ఖాదర్ మస్తాన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

యోగా గురువుకు సన్మానం



నెల్లూరు(బృందావనం): కరెంటాఫీస్ సెంటర్ సమీపంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో గురు పూజోత్సవాన్ని ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు సురేంద్రరెడ్డిని సత్కరించారు. అభ్యాసకులు మాల్యాద్రి, మస్తానయ్య, సుబ్బన్న, వరప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కార మార్గం చూపాలి



అర్జీలను స్వీకరిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలను చూపాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తెలియజేసి నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలపై 24 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని సచివాలయ కార్యదర్శులను సమన్వయం చేసుకొని జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులు తమకు కేటాయించిన నాలుగు సచివాలయాలను వారంలో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని, నోటీస్ బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా చూడాలని ఆదేశించారు.

జనహిత, వాత్సల్యకు విరాళం



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య ఆశ్రమానికి రూ.50 వేల విరాళాన్ని గుండె వ్యాధుల నిపుణుడు శ్రీనివాసరాజు ప్రకటించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ మొత్తాన్ని వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. 43 వేలకు పైగా గుండె ఆపరేషన్లు నిర్వహించి ఎందరికో ప్రాణదానం చేసిన డాక్టర్ శ్రీనివాసరాజు తన జన్మదిన వేడుకలను నిరాదరణకు గురైన బాలబాలికల మధ్య పదేళ్లుగా జరుపుకోవడాన్ని అభినందించారు. అనంతరం శ్రీనివాసరాజును సత్కరించారు. మానవ సేవే మాధవ సేవ టీమ్ నిర్వాహకులు విశ్వనాథం, కోలా రవి, ఇందిర, పుల్లారెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, విజయమ్మ, శైలజారెడ్డి, వాత్సల్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌ఆర్ ఐటీఐలో క్యాంపస్ ఎంపికలు



నెల్లూరు(బారకాసు): కొత్తూరు సమీపంలోని ఎస్సార్‌ఆర్ ఐటీఐ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను నిర్వహించారు. చెన్నైకి చెందిన ఫెనెస్టా బిల్డింగ్ సిస్టమ్స్ సంస్థ నిర్వహించిన టెక్నికల్ ట్రెయినీ, నాన్ టెక్నికల్ పోస్టులకు దాదాపు 50 మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం 22 మంది ఎంపికయ్యారని కరస్పాండెంట్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వీరికి నెలకు రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం అందనుందని చెప్పారు. కంపెనీ హెడ్ తోట విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి గ్రామంలో ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన కోసూరు అంకయ్యగౌడ్ కుటుంబానికి జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందించారు. అనికేపల్లిలోని కోసూరు అంకయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, కార్యదర్శి సుబ్బయ్యగౌడ్, నడవడి ముత్యంగౌడ్, ఉప్పల రామకృష్ణగౌడ్, నిమ్మల వెంకరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండాలమ్మపాళెంలో ఫ్యామిలీ డాక్టర్

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలోని ఓ వ్యక్తి పక్షవాతం సమస్యతో బాధపడుతుండగా వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఓ మహిళకు కుష్టు లక్షణాలుండగా వారి ఇంటికి వెళ్లి పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిని గీతా షాలిని, హెచ్‌ఎస్ ఎన్.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ రషీదా, హెచ్‌ఏలు షఫీ ఉద్దీన్, విజయలక్ష్మి, ఆశా కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 4,450 మందికి గానూ 3,980 హాజరయ్యారు. నెల్లూరు నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు, కావలిలోని ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబారయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 65 మందికి గానూ 58 మంది హాజరయ్యారు. కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఒకర్ని డీబార్ చేసినట్లు వెల్లడించారు.

16న గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

వెంకటాచలం: నెల్లూరు నగరంలోని టౌన్‌హాలులో ఈనెల 16వ తేదీన జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తారని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు సుబ్బయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 450 పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తారని తెలియజేశారు.

కవి పండితులకు సత్కారం



నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కురువాడ సత్యనారాయణ కల్యాణ మండపంలో ఆలూరు శిరోమణిశర్మ, కవి పండితులను సోమవారం సత్కరించారు. కోవూరు పంచాక్షరి బ్రాహ్మణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనంతరం శిరోమణిశర్మ రచించిన శ్రీమద్రామాయణ సంగ్రహ నామాయణం నిత్యస్తోత్ర లఘుకృతిని ఆవిష్కరించారు.

నియామక పత్రాల అందజేత



నెల్లూరు సిటీ: కారుణ్య నియామకాల్లో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా ఇద్దర్ని నియమించారు. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు మృదుల, సునీల్‌కుమార్‌కు నియామక పత్రాలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు సోమవారం అందజేశారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను సోమవారం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామి వారికి గరుడోత్సవం, గిరిప్రదక్షిణను వేడుకగా జరిపారు.

ఉభయకర్తలుగా నరసింహరావు, వసంత.. ప్రసాద్‌బాబు, మమత దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ రేపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నేతలు

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాలల బంద్‌ను బుధవారం నిర్వహించనున్నామని సంస్థ నగర కార్యదర్శి యశ్వంత్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. నేతలు చందు, నరసింహ, సుమన్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా హంస వాహనసేవ



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు యాళి, హంసవాహనాలపై సోమవారం విహరించారు. ఉభయకర్తలుగా అప్పల దిలీప్ చక్రవర్తి, కల్పన.. ఆమంచర్ల పట్టాభిశర్మ, జయప్రద.. సతీష్‌బాబు, జ్యోతి.. పుట్టా నరేంద్రరెడ్డి, పెంచలలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక దర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంతినగర్, దీన్‌దయాళ్‌నగర్, మూడో మైలు, డీఎస్ నగర్, వేణుగోపాల్‌నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, సింహపురికాలనీ, మైపాడు గేట్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.